

# అతి అనావృష్టి

యం. నరేంద్ర

"సార్! టెలిగ్రాం..."

సైకిల్ను గోడవారగా నిల్చోబెట్టి వరండా మెట్లెక్కుతూ అరిచాడు వెంకటేసు.

మిట్టమధ్యాహ్నం. సమయం ఒంటిగంట యిందని తెలియజేస్తూ, ఫ్యాక్టరీ సైరను గొంతు చించుకోడానికి ప్రారంభించడమూ, ముగించడమూ గూడా అయిదు నిమిషాల క్రిందటే జరిగింది.

"టెలిగ్రాం సార్!"—ఎ కూ రెస్పాన్స్ రాకపోయేసరికి గొంతు కాస్త హెచ్చించి యింకోసారి అరిచాడు వెంకటేసు.

కాస్సేపటికి పల్చటి డోర్ కర్టెనుకు అవతల పూచిన పొదరిల్లులాంటి లావుపాటి ఆడ శరీరం కదలాడింది—"అయ్యగారు భోజనం చేస్తున్నారయ్యా! కాసేపాగు..."

సన్నని కీచుగొంతుకలోనుంచీ ఈమాటల్ని ప్రసారంచేసి, ఆ ఆకారం గృహాంతర్భాగంలోకి జారిపోయింది.

ఒకసారి వరండానంతా కలయజూచి గోడ వారగా వేయబడివున్న బెంచీపైన కూలబడ్డాడు వెంకటేసు. కాకీఫాంటు జేబులో నుంచి చేతిగుడ్డను పైకిలాగి, ముఖానికి, గొంతుకకు పట్టిన చెమటను తుడుచుకున్నాడు. ముంజేతిపైన కొత్తవాచీ కనిపించడంతో అతడి మనసు లక్ష్మిపైకి వెళ్ళింది. అది పెళ్ళిలో మామగారు పెట్టిన వాచీ. పెళ్ళయి యింకా వెలరోజులు నిండలేదు.







పిచ్చిపిల్ల! తాను వెళ్ళేటంతవరకూ అన్నం తినకుండా గుమ్మంలో నిలబడి ఎదురు కన్నులు చూస్తూ వుంటుంది.

అయినా తాను వేళకు వెళ్ళిందెప్పుడు ? ఇల్లూ, యిల్లాలూ, తిండీ నీళ్ళూ మొదలయినవన్నీ గూడా తనకీ ఉద్యోగ బాధ్యతలు తెమిలినప్పుడు ! ఈ టెలిగ్రాములిచ్చే ఉద్యోగమే యింత! ఉత్తరాలివ్వడమైతే ఏ కిటికీ గుండానో గిరవాటు పెట్టి చక్కా వెళ్ళిపోవచ్చు! దీనికలా కుదరదే! చేతికందించి సంతకం పెట్టించుకున్న తర్వాతగానీ వెళ్ళడానికి వీల్లేదు...

మళ్ళీ డోర్ కర్టెన్ వైపు చూచాడు వెంకటేసు. లోపలినుంచీ ఎలాంటి అలికిడీ బయటికి రాకపోవడంతో మళ్ళీ ఆలోచనల్లోకి జారిపోయాడు.

ఈ ఆఫీసరుగారికి వారానికొకటి రెండు టెలిగ్రాములయినా వస్తూంటాయి. ప్రతి పండగకూ గ్రీటింగ్సు తప్పనిసరి ! చాలనిదానికి పుట్టినరోజులొస్తే శుభాకాంక్షలు. అంతటితో ఏమయింది రేపు రైల్లో వస్తున్నాను — అన్న మామూలు వర్తమానానిక్కూడా టెలిగ్రాములే కావలసివచ్చాయా ? రోజూ వచ్చే బంధువుకు మర్యాదలు మందగించినట్టు, అందుకే టెలిగ్రాములంటే మహా నిర్లక్ష్యం వీళ్ళకు !

"అయ్యా ! టెలిగ్రాము" అనేసరికి —

కొందరి ముఖాల్లో భయం.

కొందరి ముఖాల్లో దుఃఖం.

కొందరి ముఖాల్లో ఆనందం.

కొందరి ముఖాల్లో ఆందోళన.

చూడ్డానికి అలవాటుపడిన వెంకటేసు టెలిగ్రాముల పట్ల నిర్లక్ష్యాన్ని మాత్రం సహించలేడు — అయినా అసహనాన్ని ప్రకటించేటందుకు అనువుగాని చోటైపోయింది.

# అతివృష్టి—అనావృష్టి

లోలోపల చిరాకుపడడ మొకటే రివాజయింది గూడా !

ఇంచుమించుగా పదిహేను నిమిషాలు కావస్తున్నా లోపలినుంచీ సడీ సవ్వడీ వినరావడంలేదు !

ఒరలోనుంచీ కత్తిని తీసినట్టుగా సంచిలోనుంచీ చరాలున టెలిగ్రాం కవరును పైకి తీశాడు వెంకటేసు.

'దేవుడిదయవల్ల యిందులో గుండెల్ని జల్లుమనిపించే దుర్వార్త ఏదైనా వుండగూడదా ...' అనుకున్నాడు. అలాగనీ మరేం దురుద్దేశంలేదు వెంకటేసుకు! ఎలాగైనా వీళ్ళకు టెలిగ్రాంసత్తా ఏమిటో తెలియాలి. అదే తనకు ముఖ్యం.

అడుగుల చప్పుడు దగ్గరి కొస్తున్నట్టుగా తోచి వెంకటేసు తటాలున లేచి నిల్చున్నాడు. ఆఫీసరుగారు బయటికి రాగానే "నమస్తే సార్!" అంటూ అప్రయత్నంగానే చేతులు జోడించాడు.

"నువ్వటోయ్ వెంకటేసూ! ఏదీ టెలిగ్రామిలా యివ్వు!" దోరగుమ్మడి పండులా మెరిసిపోతున్న తలను కుడిచేతితో నిమురుకుంటూ ఎడమ చేతిని ముందుకు చాచారు ఆఫీసరు.

టెలిగ్రామందించి పుస్తకంలో సంతకం పెట్టించుకుని "వెళ్ళొస్తానుసార్!" అంటూ బయటికి వచ్చేశాడు వెంకటేసు. ఆ టెలిగ్రాంలో ఏముంటుందో తెలుసుకోవాలన్న కుతూహలం అతణ్ణి మరీ వేగంగా ముందుకు కదలనివ్వడంలేదు. సైకిలులో గాలివున్నదీ లేనిదీ తెలుసుకునే సాకుతో అతడు కొద్ది క్షణాలదాకా సైకిలు దగ్గరే తచ్చాడుతూ వుండిపోయాడు.

అదిగో...ఏమిటది? తన ఊహకు ప్రాణం వచ్చేసినట్టుగా కీచుగొంతుక తాలూకు ఏడుపు సన్నగా వినిపించడం ప్రారంభమైంది. ఆ ఏడుపుకు వెన్నంటినట్టుగా " ఊరుకోవే, నువ్వు మరీనూ...!" అంటూ అయ్యగారి సముదాయింపు గూడా !

హమ్మయ్య!-తలపైనుంచి పెద్ద బరువు క్రిందికి దిగిపోయినట్టుగా తేలికగా ఊపిరి పీల్చుకున్నాడు వెంకటేసు. ఉత్సాహంతో సైకిలుపైన చెయ్యివేశాడు.

అరరే. అన్నట్టు యింకొక టెలిగ్రాం వుండాలిగదూ! అదిగూడా ఈ కాంపౌండులోనే బట్వాడా కావలసివున్నట్టు జ్ఞాపకం. మరపుకొచ్చిన టెలిగ్రాంను బయటకితీసి చిరునామా చూచి వెంకటేసు సందేహాన్ని నివృత్తి చేసుకున్నాడు. కూలివాడికి కూడా మగబిడ్డ అన్నట్టు — ప్యూను చెంగయ్యకు కూడా ఒక టెలిగ్రాము.


ఆఫీసరుగారి బంగళాకు కూతవేటు దూరంలో — ఓ చిన్న పూరిపాకలో చెంగయ్య కాపురం.

'అయ్యో పాపం' — నొచ్చుకున్నాడు వెంకటేసు. చెంగయ్య కొక్కడే కొడుకు మిలటరీలో వున్నాడు. వాడికేమయిందో ఏమిటో? భగవంతుడా! అలాంటిదేమీ జరగకూడదు — అనుకుంటూనే పాకముందు నిలిచి 'టెలిగ్రాం' అంటూ కేక పెట్టాడు.

భోజనం చేస్తున్న చెంగయ్య చెయ్యి కడుక్కోకుండానే బయటికి పరుగెత్తి వచ్చేశాడు.

"ఏమిటో, ఏమయిందో తొరగా చించి చదవవయ్యా వెంకటేసూ !." కంగారుగా అన్నాడు చెంగయ్య.

దేవుడికి మనసులోనే ఓ నమస్కారం సమర్పించి ఆతురతగా కవరు చించాడు వెంకటేసు. ఎర్రటి కాగితంలోని ఆ మూడు ముక్కలూ చదివేశాక తృప్తిగా ఊపిరి పీల్చుకో
















# అతివృష్టి – అనావృష్టి

గలిగాడు. "మంచి కబురే లేవోయ్ చెంగయ్య మామా! మీ అబ్బాయి వస్తున్నాడట విన్న సాయంకాలమే అక్కణ్ణుంచి బయలుదేరాడట"

ముసలి దంపతుల ముఖాల్లో ఆనందం చోటు చేసుకుంది.

"అలాగటయ్యా వెంకటేసూ! చల్లగా గుండెల్లో పాలుపోశావు బాబూ! నేనింకా ఏమిటో ననుకున్నాను." అంటూ చెంగయ్య వున్నకంలో ఒక సంతకం పడేసి "సరిగ్గా భోజనం వేళకు వచ్చావు! కాస్త ఎంగిలిపడి వెళ్ళరాదూ!" అన్నాడు.

"కానీ లేవయ్యా, ఇంకోక సారెప్పుడైనా కమ్మగా విందే పెడుదువుగానీ!" సైకిల్ క్కి తూనీగలా యింటిదారి పట్టాడు వెంకటేసు.

* * *

నాలుగురోజుల తరువాత ఒకనాటి పుదయం అటువైపున్నే ఓ పెళ్ళి గ్రాం బట్వాడా చేయడంకోసం వెళ్తూ, చెంగయ్య విషయం జ్ఞప్తికి వచ్చి నేరుగా కాంపౌండు లోకి దారి తీశాడు వెంకటేసు.

సైకిల్ను ఓ చెట్టు క్రింద నిలబెట్టి ఆఫీసరుగారి బంగళా వైపు చూశాడు. మూసిన కిటికీలతో, తాళాలు బిగించిన తలుపులతో బంగళా గాఢ నిద్రలో వున్నట్టుంది. ముంగిటు మెట్లపైన గుండె కొనిం చిన మోకాళ్ళపైకి వెంటిదబ్బలా వంగిపోయి నేలవైపు చూస్తూ కూర్చుని వున్నాడు చెంగయ్య.

"అదేంవాలకమోయ్ చెంగయ్య మామా! ఏంచేస్తున్నావ్?" పలకరించాడు వెంకటేసు.

"వ్వెనా...ఇవో హి ... నేను" అంటూ ఓ వెర్రినవ్వు నవ్వసాగాడు చెంగయ్య.

"సర్లే! నీ వెర్రి దొంగల్దోలినట్లున్నుంది. కొడుకొచ్చేశాడు గదటయ్యా? ఏమేం తెచ్చాడు?"

"వాడా! ఏం తెచ్చాడని అడుగుతున్నావా?" అయోమయంగా చూస్తూ కొనసాగించాడు చెంగయ్య.

"రావడానికైతే వచ్చేశాడు గానీ, యిక మీదట వెళ్ళేది గూడా లేదటయ్యా వెంకటేసూ! ఏడికేదో జబ్బొచ్చిందని ఏకంగా ఇంటికి వెళ్ళిపొమ్మని చెప్పేశారట మిల్ట్రీ దొరలు! వస్తూ వస్తూ ఆ జబ్బును మాత్రం వెంట తీసుకొచ్చాడు..."

"అరరే, ఎంతపని జరిగింది చెంగయ్య మామా! నీకు రావాల్సిన కష్టం గాదయ్యా బాబూ! అన్నట్టు మీ ఆఫీసరుగారికీ, నీకూ ఒకేసారి రావాలా కష్టాలు ..." సానుభూతి వెల్లడించబోయాడు వెంకటేసు.

"వాళ్ళకేం కష్టమొచ్చింది వెంకటేసూ?" తెల్లబోయినట్టుగా ఉలిక్కిపడి అడిగాడు చెంగయ్య.

"అమ్మగారి తల్లి పోయిందిగా?"

"తల్లి కాదులేవోయ్! తండ్రిగారే పోయారు. ఆయనగారి కొక్కతే కూతురు. మూడు లక్షల ఆస్తి వుంది ఆయనగారికి! పెద్దకర్మ చేసుకుని తిరిగిరావడమే ఆలస్యం. అయ్యగారు కాలనీలో మూడంతస్తుల మేడ కట్టించబోతున్నారు."

వెంకటేసు గొంతుకలో పచ్చి వెలగకాయ పడినట్టయింది. మెల్లగా సైకిలును తోసుకుంటూ తిరిగి చూడకుండా రోడ్డువైపు దారితీశాడు.

